వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 48 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-



## భారత్, అమెరికా క్లోజ్ ఫ్రెండ్స్..

- ట్రంప్ పోస్టుపై ప్రధాని మోదీ రియాక్షన్
- వాణిజ్య అడ్డంకులను తొలగించేందుకు ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నానని వెల్లడి

**న్యూఢిల్లీ, -**
భారత్, అమెరికా వాణిజ్య అడ్డంకుల తొలగింపులో భాగంగా కీలక పరిణామం చోటు చేసుకుంది. వాణిజ్య అడ్డంకులను తొలగించేందుకు ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీనికి ప్రధాని మోదీ కూడా సానుకూలంగా స్పందించారు. తాను కూడా ట్రంప్‌తో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.భారత్‌పై అదనపు సుంకాలు విధిస్తుండటంతో అమెరికాతో వాణిజ్య సంబంధాలు బీటలు వారాయి. ఈ నేపథ్యంలోనే ఆ వాణిజ్య అడ్డంకులను తొలగించేందుకు ట్రంప్ ముందుకొచ్చారు. తన ట్రూత్ సోషల్‌లో స్పందించిన ఆయన.. భారత్, అమెరికా మధ్యవ ఆణిజ్య అడ్డకుంలను తొలగించుకునేందుకు చర్చలు -మిగతా 3 లో



## 12న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పదవీ ప్రమాణం

- రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించనున్న ముర్ము

**న్యూఢిల్లీ,**
ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు చేపట్టేందుకు ముహూర్తం ఖరారు అయిందని తెలుస్తోంది. ఈనెల 12వ తేదీన సీపీ రాధాకృష్ణన్ 15వ భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఉపరాష్ట్రపతి చేత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు- చురుగ్గా కొనసాగుతున్నాయి. భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశారు. దీంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఆ క్రమంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను రంగలోకి దింపారు. అలాగే ప్రతిపక్ష ఇండి కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని బరిలో దింపారు. సెప్టెంబర్ 9వ తేదీన జరిగిన -మిగతా 3 లో



# హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టాలి

**| రాజ్‌నాథ్ సింగ్‌తో కీలక భేటీలో పలు ప్రాజెక్టులపై చర్చ |**

- అత్యవసరంగా స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం
- మెహిదీపట్నం వద్ద స్కైవాక్ ప్రాజెక్ట్
- రాజీవ్ రహదారిలో ఔటర్ వరకు ఆరులేన్ల విస్తరణ
- లంగర్‌హౌజ్‌లో గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం
- రక్షణశాఖ భూములు బదిలీ చేయాలని కోరిన సీఎం రేవంత్
- చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళి



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**
ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. కంటోన్మెంట్‌లో రహదారి విస్తరణ, రక్షణశాఖ భూముల బదలాయింపుపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్రష్టానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, తెలంగాణలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన రక్షణ శాఖ భూములను బదలాయించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం అత్యవసరం అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న భూములను రాష్ట్రానికి బదిలీ చేయాలని -మిగతా 3 లో



## జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర

- జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో పార్టీని గెలిపించడమే గోపీనాథ్‌కు సరైన నివాళి
- సమీక్ష సమావేశంలో కేటీఆర్ వెల్లడి

**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**
అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ మొదటి వారంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఉంటుందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నుంచి భారత రాష్ట్ర సమితి జైత్రయాత్ర మళ్లీ ప్రారంభం కావాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీ–ఆర్ మాట్లాడుతూ.. మాగంటి సునీతకు అందరి ఆశీస్సులు ఉంటాయని ఆశిస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో పార్టీని గెలిపించడమే గోపీనాథ్‌కు -మిగతా 3 లో



## ఆర్మీ గుప్పట్లోకి నేపాల్ పాలన

- రాజ్యాంగాన్ని తిరగారాయాలంటున్న జెన్‌జడ్
- సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేసిన భారత్

**ఖాట్మండ్ -**
హిమాలయ హిందూ దేశం ఆర్మీ చేతుల్లోకి వెళ్లింది. ఆర్మీ కంట్రోల్ చేసేందుకు అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. జెన్‌జడ్ ఆగ్రహంతో అల్లకల్లోలమైన నేపాల్‌లో పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఆ దేశ ఆర్మీ రంగంలోకి దిగింది. కర్ఫ్యూ ప్రకటించింది. మరోవైపు, నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్నిరసనకారుల బృందంతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో యువ ఆందోళనకారులు తమ డిమాండ్లను వెల్లడించారు. రాజ్యాంగాన్ని తిరిగిరాయాలని డిమాండ్ చేశారు. ఈ యువతరంగం నేపాల్ పాలనలో సమూల మార్పులు ఆశిస్తోంది. దానికి తగ్గట్టుగా కొన్ని డిమాండ్లను ముందుంచింది. ఈ ఉద్యమం ఒక పార్టీ, ఒక వ్యక్తి కోసం కాదు. మొత్తం ఒక జనరేషన్, దేశ భవిష్యత్తు కోసం. కొత్త రాజకీయ వ్యవస్థ ఆధారంగానే శాంతి నెలకొంటుంది. అధ్యక్షుడు, నేపాల్ సైన్యం మా ప్రతిపాదనలను సానుకూలంగా అమలుచేస్తుందని భావిస్తున్నామని ఓ ప్రకటనలో వారు -మిగతా 3 లో

## ప్రజాస్వామ్యం పట్ల ఆ ఇద్దరికీ గౌరవం లేదు

**మోడీ, అమిత్ షాలపై ఖర్గే విమర్శలు**



**గాంధీనగర్**
భారత రాజ్యాంగాన్ని గానీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశం మోడీ, అమిత్‌షాలకు లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలపై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఖర్గే గుజరాత్‌లోని జునాగఢ్‌కి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రతిపక్షాల ప్రధాన లక్ష్యం ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడడటమే. ప్రజాస్వామ్యంలో -మిగతా 3 లో



## అవినీతి సొమ్మును కక్కిస్తాం

- రాజకీయ కక్షసాధింపులకు తావు లేదు
- మీడియాతో మంత్రి కోమటిరెడ్డి

**నల్గొండ, ప్రజా స్వేచ్ఛ**
కాళేశ్వరం ప్రాజెక్టు, ఈ కారు రేస్, ధరణిలో దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం... పేదలకు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. అవినీతి సొమ్మను రాబడతామని అన్నారు. బిఆర్ఎస్ నేతలు అవినీతిలో రాజ్యమేలారని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు.. పక్క రాష్ట్రంలో మాజీ మంత్రులు ఎంపీ, ఎమ్మెల్యేలు అరెస్ట్ అవుతున్నారని తెలిపారు. ఇక్కడ అరెస్టులు లేవని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా ఖూనీ చేసింని ఆరోపించారు. రాజకీయ కక్ష -మిగతా 3 లో

## పొరుగుదేశాల్లో ఏం జరుగుతందో చూడండి

- అందుకే మన రాజ్యాంగం పట్ల మేం గర్విస్తున్నాం
- గవర్నర్ల కేసు సందర్భంగా చీఫ్ జస్టిస్ ఆసక్తికర వ్యాఖ్య




3 లో

# బీజేపీని నాశనం చేసే కుట్రలు

**రాష్ట్ర కార్యవర్గంలో కిషన్ రెడ్డి అనుచరులు**

- పార్టీ పెద్దల ఆశీర్వాదం ఎప్పుడు తనకే
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేది లేదన్న రాజాసింగ్



**హైదరాబాద్,**
బీజేపీని సర్వనాశనం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. అసలైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి అన్యాయం జరుగుతోందన్నారు. పార్టీలో నా మనిషి, నీ మనిషి అనే రాజకీయం నడుస్తోందని వ్యాఖ్యానించారు. కొత్త కమిటీలో 12 మంది ఒకే పార్లమెంటు సెగ్మెంట్ వాళ్లు ఉన్నారని చెప్పారు రాజాసింగ్. రాష్ట్ర కమిటీని కిషన్ రెడ్డి వేశారా? లేక రామచందర్ రావు వేశారా అని ప్రశ్నించారు. రామచందర్ రావు మంచి వ్యక్తే కానీ..రబ్బర్ స్టాంప్ అని అన్నారు. ఈ ప్లానింగ్ అంతా కిషన్ రెడ్డిదేనని విమర్శించారు. -మిగతా 3 లో

## ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ అమలు

- గ్రామీణ రోడ్లకు కూటమి ప్రభుత్వం పెద్దపీట
- గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలకు చెక్ పెట్టాం
- అనంత సభలో డీప్యూటి సీఎం పవన్ కళ్యాణ్



**అనంతపురం**
ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్‌సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అనంతపురంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన 'సూపర్‌సిక్స్ సూపర్‌హిట్' బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని చెప్పారు. ప్రతి కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్యబీమా కల్పించాం. ఒకే రోజు రికార్డుస్థాయిలో గ్రామసభలు నిర్వహించాం. కోటి మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టాం. శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాంఅని తెలిపారు. ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తున్నామని అన్నారు. అనుభవజ్ఞుడైన సిఎం చంద్రబాబు నాయకత్వంలో ఎపి పురోగమిస్తోందని అన్నారు. ఆయన దార్శనికత రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకుని -మిగతా 3 లో

# మాస్కోలో తొలి ఎఐ ట్రామ్!



**మాస్కో ప్రజా స్వేచ్ఛ**

కృత్రిమ మేథస్సు (ఎఐ)తో రష్యాలోనే తొలి స్వయం ప్రతిపత్తి (అటానమస్) ప్రయాణికుల ట్రామ్‌ను మాస్కోలో ప్రారంభించారు. మాస్కో ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. 2030నాటికి మాస్కోను రవాణాపరంగా అభివృద్ధిపరచాలన్న లక్ష్యంలో భాగంగా ఈ ప్రాజెక్టు చేపట్టారు. అప్పటికల్లా 300కి పైగా ట్రామ్‌లు ఈ సాంకేతికతను సమకూర్చుకుంటాయని భావిస్తున్నారు. ఈ అటానమస్ ట్రామ్ ట్రాఫిక్ సిగల్స్‌కు అనుగుణంగా ఆగడం, తలుపులు తెరుచుకోవడం, మూసుకోవడం వంటి చర్యలను స్వతంత్రంగానే చేస్తుంది. ట్రాక్‌లను కూడా ఆటోమేటిక్‌గా మార్చేస్తుంది. షెడ్యూళ్ళను కచ్చితంగా పాటిస్తుంది. గతేడాది మే నుండి ఈ ట్రామ్ 8వేల కిలోమీటర్లకు పైగా ట్రయల్ రన్ తిరిగింది. ఎక్కడా ఒక్కసారి కూడా ట్రాఫిక్ ఉల్లంఘన జరగలేదు. ఫెడరల్ చట్టాల ప్రకారం ట్రామ్ కేబిన్‌లో ఒక ఆపరేటర్ వుంటాడు. మొత్తంగా వ్యవస్థను, డ్రైవింగ్‌యేతర కార్యకలాపాలను పర్యవేక్షించడం అతని బాధ్యత. కృత్రిమ మేథస్సుతోనడిచే ఈ ట్రామ్‌లో మాస్కోలోనే అభివృద్ధిపరిచిన అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ వుంది. ఈ ఏడాది చివరకు ఇటువంటి మూడు ట్రామ్‌లు తిరగాలన్నది ఆలోచనగా వుంది. వచ్చే ఏడాదికి 15కి పెంచాలని భావిస్తున్నారు. అలాగే ఈ ఏడాది చివరి నాటికి అటానమస మెట్రో రైలును కూడా పరీక్షించాలని ఆలోచిస్తున్నారు.

# ఐశ్వర్య బాటలో అభిషేక్ బచ్చన్

## ఏఐ సాయంతో అశ్లీల కంటెంట్ తయారీ

## ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు




**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ బుధవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పబ్లిసిటీ-, పర్సనాలిటీ- హక్కులకు రక్షణ కల్పించాలని న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. కొన్ని వెబ్‌సైట్‌లు తన అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు వాడుకుంటున్నాయని.. వాటిని ఉపయోగించేందుకు వీలులేకుండా ఆదేశాలివ్వాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. కొందరు వ్యక్తులు ఏఐతో అభిషేక్ ఫొటోలు క్రియేట్ చేసి అశ్లీల కంటెంట్‌కు ఉపయోగించుకుంటున్నట్లు- నటుడి తరపు న్యాయవాది ప్రవీణ్ కోర్టుకు (తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు కోర్టుకు సమర్పించినట్లు- చెప్పారు. ఇక సోషల్ మీడియాలో వైరలవుతోన్న ఏఐ ఫొటోలు, వీడియోలు సెలబ్రిటీలకు తలనొప్పిగా మారాయి. తాజాగా ఇదే విషయంపై అభిషేక్ సతీమణి, నటి ఐశ్వర్యారాయ్ కూడా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అనుమతి లేకుండా తన ఫొటోలను, పేరును ఉపయోగించేందుకు వీలులేకుండా ఆదేశాలివ్వాలని ఆమె కోర్టును కోరారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఐశ్వర్య పేరు, ఫొటోలు ఉపయోగించకుండా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేస్తామని సూచించింది.

# బీహార్‌లో రోడ్లు, రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

## కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

ఈ ఏడాదిలో ఎన్నికలు జరగబోయే బీహార్‌లో ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం పెద్దపీట వేసింది. బుధవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం జరిగింది. బీహార్‌లోని బక్సార్ - భాగల్‌పూర్ హైస్పీడ్ కారిడార్ పరిధిలోని మోకామా - ముంగేర్ నలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మొత్తం 82.4 కిలో మీటర్ల పొడవున్న ఈ రహదారి ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 4,447.38 కోట్లుగా నిర్ణయించారు. దీంతో పాటు బీహార్‌లోని భాగల్పూర్ దంకా రాంపూర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. బీహార్, జార?ండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని భాగల్పూర్-దుమ్కా-రాంపూర్హాట్ సింగిల్ రైల్వే లైన్ సెక్షన్ 177 కిలోమీటర్ల రైల్వే డబ్లింగ్ పనులకు రూ.3,169 కోట్ల కేంద్రం ఖర్చు చేయనుంది.

# 40 ప్రాంతీయ పార్టీల ఆదాయం రూ.2,532 కోట్లు




**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

2023-24 ఆర్థిక సంవత్సరంలో 40 ప్రాంతీయ పార్టీలు రూ.2,532.09 కోట్ల ఆదాయాన్ని ప్రకటించాయి. ఈ నిధుల్లో 70 శాతానికి పైగా ఎన్నికల బాండ్ల ద్వారా అందాయి. దేశంలోని 40 ప్రాంతీయ పార్టీల ఆదాయ, వ్యయాలను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విశ్లేషించింది. ఎన్నికల సంఘం(ఈసీ)కి సమర్పించిన ఆడిట్ నివేదికల ప్రకారం భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అత్యధికంగా రూ.685.51 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రూ.646.39 కోట్లు, బీజూ జనతాదళ్ (బీజేపీ) రూ.297.81 కోట్లు, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) రూ.285.07 కోట్లు, వైఎస్సార్ కాంగ్రెస్ రూ.191.04 కోట్ల ఆదాయంతో తర్వాత స్థానాల్లో ఉన్నాయి. 40 ప్రాంతీయ పార్టీలు ప్రకటించిన మొత్తం ఆదాయంలో ఈ ఐదు పార్టీల ఆదాయం వాటా 83.17 శాతం.కాగా, 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం 45.77 శాతం మేర పెరిగిందని ఏడీఆర్ తెలిపింది. ఆ ఆర్థిక సంవత్సరంలో ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం రూ.1,736.85 కోట్లుగా పేర్కొంది. టీఎంసీకి రూ. 312.93 కోట్ల మేర ఆదాయం పెరిగింది. టీడీపీ, బీజేపీ కూడా గణనీయమైన ఆదాయ పెరుగుదలను నమోదు చేసినట్లు వెల్లడించింది. మరోవైపు తమ ఆదాయంలో కొంత భాగాన్ని ఖర్చు చేయలేదని 27 ప్రాంతీయ పార్టీలు ప్రకటించాయి. బీఆర్ఎస్ ఖర్చు చేయని ఆదాయం రూ.430.60 కోట్లు, టీఎంసీ రూ. 414.92 కోట్లు, బీజేడీ రూ. 253.79 కోట్లు మేర ఆదాయాన్ని ఖర్చు చేయలేదు. వైఎస్సార్ కాంగ్రెస్, ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే), సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), జనతాదళ్ (యునైటెడ్) సహా 12 పార్టీలు తమ ఆదాయం కంటే ఎక్కువ ఖర్చు చేశాయి. ఆదాయం కంటే సుమారు 55 శాతం ఎక్కువ ఖర్చులు వైస్సార్ కాంగ్రెస్ చూపింది. గోవా ఫార్వర్డ్ పార్టీకి ఎలాంటి ఆదాయం లేనప్పటికీ రూ.1.56 లక్షల వ్యయం ప్రకటించింది.కాగా, బీఆర్ఎస్, టీఎంసీ, బీజేడీ, టీడీపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్, డీఎంకే సహా పది పార్టీలు ప్రకటించిన మొత్తం ఆదాయంలో రూ. 2,117.85 కోట్లు (83.64 శాతం) స్వచ్ఛంద విరాళాల నుంచి వచ్చాయి. ఇందులో ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన విరాళాలు రూ. 1,796.02 కోట్లు (70.93 శాతం).మరోవైపు ఏడీఆర్ ఆర్టీఐ దరఖాస్తుకు ప్రతిస్పందనగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన సమాచారం ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని రాజకీయ పార్టీలు రూ. 4,507.56 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను తిరిగి పొందాయి. ఇందులో దాదాపు 55.99 శాతం (రూ. 2,524.14 కోట్లు) జాతీయ పార్టీలు, 39.84 శాతం (రూ. 1,796.02 కోట్లు) ప్రాంతీయ పార్టీలు సేకరించాయి.2023-24 ఆర్థిక సంవత్సరంలో కేవలం మూడు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మాత్రమే ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలు అందుకున్నట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది.

# ఆ విషయంలో ఎక్కడివరకైనా వెళ్తాం..

## పాక్, స్విట్జర్లాండ్‌కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్..!



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**

జెనీవాలో జరిగిన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి 60వ సెషన్ 5వ సమావేశంలో పాకిస్తాన్, సింగపూర్ దేశాలకు భారత్ ఘాటుగా జవాబు ఇచ్చింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే సత్తా భారత్‌కు ఉందని.. ఎవరి నుంచి నేర్చుకోవాల్సిన, సలహాలు తీసుకోవాల్సిన అవసరం లేదని భారత దౌత్యవేత్త క్షితిజ్ త్యాగి స్పష్టం చేశారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ప్రస్తావించిన త్యాగి.. భారత్ తమ దేశ పౌరులను కాపాడుకునేందుకు ఎక్కడి వరకైనా వెళ్తుందని స్పష్టం చేశారు. తాము సార్వభౌమాధికారంపై రాజీపడబోమని.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే విఫల దేశం తప్పుడు ప్రచారాన్ని బహిర్గతం చేస్తూనే ఉంటామన్నారు. పాకిస్తాన్‌పై నేరుగా ఎదురుదాడి చేస్తూ.. ఆ దేశం ఉనికి ఉగ్రవాదం, తప్పుడు ప్రచారంపైనే ఆధారపడి ఉందని ఘాటుగా స్పందించారు.పాకిస్తాన్ ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్‌ని తన సొంత ప్రయోజనాల కోసం ఉపయోగిస్తుందని, భారతదేశానికి వ్యతిరేకంగా అనారోగ్య అబ్సెసివ్ ఆలోచన దాని ఉనికికి మద్దతుగా మారిందని క్షితిజ్ త్యాగి విమర్శించారు. అలాగే, స్విట్జర్లాండ్ ప్రకటనపై స్పందిస్తూ.. భారత్‌కు సన్నిహిత మిత్రదేశమైనప్పటికీ స్విట్లర్లాండ్ తప్పుడు వ్యాఖ్యలు చేసిందన్నారు. తప్పుడు కథనాలను వ్యాప్తి చేయడానికి బదులుగా తన దేశం(స్విట్జర్లాండ్)లోని సమస్యలైన జాత్యహంకారం, వివక్ష, విదేశీయులపై ద్వేషం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని' హితవు పలికారు. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద, వైవిధ్యభరితమైన ప్రజాస్వామ్యం ఉన్న దేశమన్నారు. అవసరమైతే స్విట్జర్లాండ్ ఈ సమస్యలను పరిష్కరించడానికి సహాయం చేసేందుకు భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

# దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

## అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం




**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఓ సమావేశంలో ఇందుకు సంబంధించిన సన్నాహాలను చర్చించారు. అన్ని రాష్ట్రాలు ,కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారు(సిఈఓ)లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ ప్రతిపాదనకు వారి ఆమోదం లభించింది. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఇలాంటి ఓటర్ల జాబితా సవరణ నిర్వహించింది.ఇదే పక్రియను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు విస్తరించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది.బీహార్ లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసే లోగానే స్పెషల్ ఇం-టె-న్సివ్ రివిజన్ పై ప్రకటన రావచ్చునని ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశం కాన్ఫరెన్స్ - కమ్- వర్క్ షాప్ మాదిరి సాగింది. ఈ సందర్భంగా ఎప్పటిలోగా ఈ పక్రియ చేపట్టే అవకాశం ఉందని సిఈఓల అభిప్రాయాలను తెలుసుకున్నారు. చాలా మంది అక్టోబర్ నుంచి సర్ చేపట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ నెలలో అందుకు అవసరమైన సన్నాహాలు పూర్తి చేస్తామని కూడా కమిషన్ కు తెలిపారు.ఈ సమావేశంలో ప్రధానంగా స్పెషల్ ఇం-టె-న్సివ్ రివిజన్ కోసంచేయాల్సిన సన్నాహాలపై దృష్టి పెట్టారు. సవరణ సమయంలో ఓటర్లను ధృవీకరించేందుకు అవసరమైన పత్రాల జాబితా సిద్ధం చేయాలని కూడా ఎన్నికల కమిషన్ రాష్ట్రాల సిఈఓలను ఆదేశించింది.స్థానికంగా సులభంగా అందుబాటు-లో ఉండే సర్టిఫికెట్లపై ఆధారపడి ఈ పక్రియ సాగుతుంది. ఇవి ఒక్కో ప్రాంతంలో ఒక్కో మాదిరిగా ఉండవచ్చు.అర్హత ఉన్న ప్రతి ఓటర్ పేరును ఓటర్ల జాబితాలో చేర్చడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రధాన లక్ష్యం అని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. అలాగే, మరణించిన వారి పేర్లు తొలగించి, నకిలీ ఎంట్రీ-లను తొలగిండంతోపాటు-, పౌరులు కానివారి పేర్లనూ డిలీట్ చేయాలని,శాశ్వతంగా నివాసం మారిన వారి పేర్లనూ తొలగించాల్సి ఉంటు-ందని ఎన్నికల కమిషన్ స్పష్టంచేసింది.

# తమిళనాడులో రూ.1000 కోట్ల పైగా సైబర్ మోసాలు



**ఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

తమిళనాడులో 2025 సంవత్సరంలో ఇప్పటివరకు రూ.1,100 కోట్ల నష్టం వాటిల్లిన సైబర్ మోసాలకు సంబంధించి లక్షకు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పి) తెలిపింది. సైబర్ నేరస్థులు ఫిషింగ్ ఇమెయిల్‌లు, నకిలీ వెబ్‌సైట్‌లు లేదా హానికరమైన అటాచ్‌మెంట్‌లు వంటి మోసపూరిత వ్యూహాలను ఉపయోగించి ప్రజలను మోసం చేశారు. భారీ రాబడి వస్తుందని నమ్మబలికి నకిలీ ఆన్‌లైన్ లింక్‌లను క్లిక్ చేయించి భారీ స్కాములకు పాల్పడ్డారు. అందిన అనేక ఫిర్యాదులలో పెట్టుబడి స్కామ్‌లు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు ఉన్నాయి. 2024లో ఎన్సీఆర్పి పోర్టల్‌లో 1,27,041 ఫిర్యాదులు నమోదయ్యాయి. అందులో 13,287 పెట్టుబడి స్కామ్‌లు కాగా, 4,439 డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లుగా నివేదించబడ్డాయి. రూ. 1,673 కోట్లు నష్టపోయారని, అందులో రూ. 772 కోట్లు స్తంభింపజేసి, రూ. 84 కోట్లు బాధితులకు తిరిగి ఇచ్చామని సైబర్ క్రైమ్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సందీప్ మిట్టల్ తెలిపారు. ఈ సంవత్సరం జూలై వరకు రూ.1,010 కోట్ల నష్టం జరిగినట్లు నివేదించబడింది. అందులో రూ.314 కోట్లు స్తంభింపజేయబడ్డాయి. అవసరమైన కోర్టు ఆదేశాలు పొందిన తర్వాత రూ.62.4 కోట్లు బాధితులకు తిరిగి ఇవ్వబడ్డాయి. తమిళనాడు సైబర్ క్రైమ్ వింగ్ ప్రయత్నాల కారణంగా, మద్రాస్ హైకోర్టు అన్ని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు సర్క్యులర్ జారీ చేసిందని, స్తంభింపచేసిన డబ్బును బాధితులకు తిరిగి ఇవ్వడానికి ఎఫ్ఐఆర్ లు నమోదు చేయమని పట్టుబట్టవద్దని ఆదేశిస్తూ మిట్టల్ చెప్పారు.

## భారత్, అమెరికా క్లోజ్ ఫ్రెండ్స్..

(మొదటి తరువాయి)

కొనసాగిస్తున్నామని ప్రకటించడానికి సంతోషిస్తున్నానని తెలిపారు. రాబోయే రోజుల్లో తన స్నేహితుడు, భారత ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య జరిగే వాణిజ్య చర్చలకు విజయవంతమైన ముగింపు పలికేందుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అనుకుంటున్నానని తెలిపారు. భారత్‌తో వాణిజ్య చర్చల గురించి ట్రంప్ చేసిన పోస్టుపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. భారత్, అమెరికా క్లోజ్ ఫ్రెండ్స్, సహజ భాగస్వాములని మోదీ తెలిపారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య అడ్డంకులు తొందరలోనే తొలగిపోతాయని ధీమా వ్యక్తం చేశారు. తమ మధ్య సంబంధం మరింత బలపడతుందని ఆశించారు. భారత్, అమెరికా మధ్య వాణిజ్య అడ్డంకులను తొలగించడంలో భాగంగా తన స్నేహితుడు భారత ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఆసక్తిగా ఎదరుచూస్తున్నానని ప్రకటించారు. రెండు దేశాల భవిష్యత్తు కోసం కలిసి పనిచేస్తామని ప్రకటించారు.

## 12న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పదవీ ప్రమాణం

(మొదటి తరువాయి)

ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 148 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు- పోలయ్యాయి. ఇక బీఆర్ఎస్, బీజేడీ, ఎస్ఎల్‌డీలు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. మరోవైపు మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

## జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర

(మొదటి తరువాయి)

సరైన నివాళి అని పేర్కొన్నారు. ఓటుకు రూ.5 వేలు పంచితే గెలుస్తామని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సీఎం సోదరుడు చెరువులో ఇళ్లు కట్టినా హైడ్రా వెళ్లదని.. కానీ పేదల బస్తీలకు వెళ్లి ఇళ్లు కూలగొడతారని విమర్శించారు. ఉపఎన్నిక కోసం సర్వేలు చేయిస్తున్నాం.. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి బాగుంది. కొన్ని బస్తీల్లో వెనకంజలో ఉన్నాం. అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి. ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు ఉంటే తొలగించాలి.. లేనివారివి చేర్చాలి. ఓటు- వేయకపోతే సంక్షేమ పథకాలు బంద్ చేస్తామని.. ఇళ్లు కూలుస్తామని అంటారు. పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవు కానీ మూసీ ప్రాజెక్టుకు డబ్బులు ఉన్నాయట. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సత్తా చూపాలి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేరు. మాగంటి గోపీనాథ్‌లాగే తనకూ అండగా నిలవాలని కార్యకర్తలను ఆయన సతీమణి సునీత కోరారు. గోపీనాథ్ ఆశయాలను నెరవేర్చేందుకు అందరమూ కలిసి పనిచేద్దామన్నారు. భారత రాష్ట్ర సమితిలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉందని మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు.

## ఆర్మీ గుప్పట్లోకి నేపాల్ పాలన

(మొదటి తరువాయి)

పేర్కొన్నారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని తిరిగి రాయాలని, మూడు దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు సాగించిన అవినీతిపై దర్యాప్తు జరపాలని కోరుతున్నారు. అలాగే ఈ ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అమరులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుద్యోగాన్ని పారదోలేందుకు, వలసలు అరికట్టేందుకు, సామాజిక అన్యాయాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వీరి బృందం ఆర్మీ ప్రతినిధులతో కలిసి అధ్యక్షుడిని కలవనుంది. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోన్న భారత్.. సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. సామాజిక మాధ్యమాలపై నేపాల్ ప్రభుత్వం నిషేధం విధించడంతో ఒక్కసారిగా పెల్లుబికిన ఆందోళనల తీవ్రతకు కేపీ శర్మ ఓలీ ప్రధాని పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. దాంతో తదుపరి ప్రభుత్వం ఏర్పాటయ్యేవరకు పరిస్థితులను చక్కదిద్దేందుకు ఆర్మీ బాధ్యతలు తీసుకుంది. ఈ క్రమంలో సైనికులు రాజధాని కాఠ్‌మాండూ వీధుల్లో పహారా కాస్తున్నారు. ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని కోరారు. నిరసనకారులు చర్చలకు రావాలని చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్ పిలుపునిచ్చారు. ఈ కర్ఫ్యూ వేళ.. విధ్వంసం, దోపిడీ, దాడులు వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నేపాల్ ను ఆనుకొని ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో మన దేశం భద్రతను పెంచింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సరిహద్దు జిల్లాల్లో మార్కెట్లు- మూగబోయాయి. తమ రోజువారీ జీవనానికి ఆటంకం ఏర్పడటంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## ప్రజాస్వామ్యం పట్ల ఆ ఇద్దరికీ గౌరవం లేదు

(మొదటి తరువాయి)



పోరాడటం సర్వసాధారణమే. కానీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే మా లక్ష్యం. మహాత్మాగాంధీ, సర్దార్‌వల్లభారుపటేల్ వంటి గొప్ప వ్యక్తులు జన్మించిన భూమి ఇది. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన ఈ ఇద్దరు మనకు అత్యంత గౌరవనీయులు. వారివల్లే దేశం ఐక్యం ఉంది. కానీ మరో ఇద్దరు వ్యక్తులు మోడీ, అమిత్‌షా మాత్రం రాజ్యాంగం సురక్షితంగా ఉండాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కానీ కోరుకోవడం లేదు' అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ఎన్నిలపై ఆయన స్పందించారు. 'మాకు మెజారిటీ- లేదు. అయినప్పటికీ మాకు ఉన్నన్ని ఓట్లు- వచ్చాయి' అని ఖర్గే అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలపై కాంగ్రెస్ సీనియర్ నేత మనీష్ తివారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగిందని, దీన్ని తీవ్రమైన విషయంగా పరిగణించి దర్యాప్తు చేయాలని ఆయన అన్నారు.

## హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టాలి

(మొదటి తరువాయి)



కోరారు. ముఖ్యంగా, మెహదీపట్నం రైతుబజార్ వద్ద స్కై వాక్ నిర్మాణానికి భూమి అవసరమని, దీనివల్ల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మరో ముఖ్యమైన అంశం రాజీవ్ రహదారి విస్తరణను కూడా ప్రస్తావించారు. హైదరాబాద్-కరీంనగర్-రామగుండంలను కలిపే ఈ రహదారిలో, ప్యాకేజీ జంక్షన్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వరకు ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల రక్షణ శాఖ భూమి అవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని వివరించారు. వీటితో పాటు-, తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటుపైనా ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు- సమాచారం.లంగర్‌హౌజ్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 98.20 ఎకరాల రక్షణశాఖ భూములు తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. మూసీ, ఈసీ నదుల సంగమం సమీపంలో 'గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ-' నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిలుస్తుందని పేర్కొన్నారు. గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం నిర్మిస్తామన్నారు. చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ఘాట్లు-, శాంతి విగ్రహం, మ్యూజియం ఏర్పాటు చేస్తామని రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం తెలిపారు. సీఎం వెంట పలువురు తెలంగాణ ఎంపీలు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాజ్ నాథ్ సింగ్‌తో జరిగిన ఈ సమావేశం రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు ఊతమిస్తుందని భావిస్తున్నారు. ఇదిలావుంటే అణచివేత, దమనకాండపై చాకలి ఐలమ్మ ధిక్కార పతాకాన్ని ఎగురవేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ గడ్డపై దొరల అహంకారానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 80 ఏళ్ల క్రితమే జంగ్ సైరన్ ఊదిన యోధురాలు అని తెలిపారు. సమ్మక్క, సారలమ్మ, చాకలి ఐలమ్మ స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించినట్లు గుర్తుచేశారు.

## బీజేపీని నాశనం చేసే కుట్రలు

(మొదటి తరువాయి)

కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే తాను కూడా చేస్తానని అన్నారు. కిషన్ రెడ్డి ఇండిపెండెంట్ గా పోటీ- చేయాలి. నేనూ చేస్తా..ఎవరు గెలుస్తారో చూసుకుందాం అని సవాల్ విసిరారు. రాజాసింగ్ ఎప్పుడైనా ఏక్ నిరంజన్ అని..తన వెనుక ఎవరూ లేరన్నారు .రాజీనామా చేయనని ఏం చేసుకుంటారో చేసుకోండని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చే పార్టీని పండబెట్టారని వ్యాఖ్యానించారు. ఇపుడు ఏ కార్యకర్త పనిచేయడానికి ఇష్టపడటం లేదన్నారు. తనపై పోస్టులు పెట్టిన వ్యక్తి ఎక్కడుంటాడో చూసుకోవాలని హితవు పలికారు. తన గురించి విమర్శించే వాళ్లు వాళ్ల గురించి ఆలోచించుకోవాలని సూచించారు రాజాసింగ్. తన మీద విమర్శలు చేసే అర్హత ప్రధాన కార్యదర్శి అశోక్ కు లేదన్నారు. గతంలో ఏబీవీపీ కార్యకర్తలపై కేసులు పెట్టిచ్చిన చరిత్ర అశోక్ దని చెప్పారు.నెలకు డబ్బులిచ్చి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తల గొంతుకగా తాను మాట్లాడుతున్నానని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాజీనామా చేస్తే.. నేను కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. ఇద్దరం కలిసి ఎన్నికలకు వెళ్దాం. భాజపా నాకు ఎలాంటి సహకారాలు అందించలేదు. పార్టీలో నేను ఎలాంటి పదవి ఆశించలేదు. ఇప్పుడున్న కమిటీతో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రాదు. ఈ కమిటీతో అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తా. పార్టీని నాశనం చేస్తున్నదెవరో మరోసారి చెబుతా.దిల్లీ పెద్దలు నాకు తరచూ ఫోన్ చేసి మాట్లాడతారు. నాకు ఎప్పటి నుంచో కేంద్రంలోని పెద్దల ఆశీర్వాదం ఉంది. వాళ్లను కలిసి పార్టీలో జరిగిందంతా చెబుతా. నేను ఎప్పటికీ భాజపా నేతనే. సెక్యులర్ వాదిని కాదు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీల్లో చేరను. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినందుకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఫోన్ చేసి తిట్టారు. నేను చేసే కామెంట్స్ పార్టీపై కాదు.. కొందరు నేతలపై మాత్రమే. కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దిల్లీ పెద్దలు పిలిస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా అని రాజా సింగ్ తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ అమలు

(మొదటి తరువాయి)



వెళుతోందన్నారు. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో డోలీ మోతలు ఉండవని హామీ ఇస్తున్నాం అన్నారు. శివతాండవాన్ని వినిపించిన నేల ఇది.. ఎందరో కవులు, కళాకారులు పుట్టిన నేల ఇది.. సీమకు ఎప్పుడూ కరువు కాలం, ఎండా కాలమే.. దీన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నాం అన్నారు.. రాయలసీమకు ఎప్పుడూ ఒకటే సీజన్ కరవు సీజన్ అన్న ఆయన.. పార్టీలు వేరైనా, ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సూపర్ సిక్స్ హామీలతో ఎన్నికల్లో ఘన విజయం సాధించాం అన్నారు.. రాష్ట్రంలో ప్రతీ వ్యక్తికీ 25 లక్షల రూపాయల ఆరోగ్య భీమా అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.. 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించామని పేర్కొన్నారు. 1,005 కోట్ల రూపాయలతో పీఎం జన్ మన్ పథకం ద్వారా 625 గిరిజన గ్రామాలను అనుసంధానించి రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం.. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో డోలీ మోతలు ఉండవని హామీ ఇస్తున్నాం అన్నారు.. రాష్ట్రంలో పచ్చదనం పెంచేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నాం.. యువతకు విద్య, ఉపాధి అవకాశాలు దక్కేలా చేస్తున్నాం, ఎవరూ పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు చేశాం అన్నారు.. ప్రజా ప్రయోజనాల కోసం ఐక్యంగా కూటమి పార్టీలు కలిసి కొనసాగుతాయని స్పష్టం చేశారు.. రాయలసీమను రతనాల సీమగా మార్చి చూపిస్తాం.. ఏపీని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. అనంతపురంలోని ఇంద్రప్రస్థ మైదానంలో నిర్వహించనున్న ఈ సభకు హాజరయ్యేందుకు మూడు పార్టీల కార్యకర్తలు, నేతలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో అక్కడికి చేరుకున్నారు. దీంతో అనంతపురంలో సందడి వాతావరణం నెలకొంది. సభా ప్రాంగణాన్ని తెదేపా, జనసేన, భాజపా జెండాలతో తీర్చిదిద్దారు. ఈ సభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ సమావేశంలో నేతలు వివరించారు. 'సూపర్ సిక్స్- సూపర్ హిట్' నినాదాలతో సభా ప్రాంగణాన్ని కార్యకర్తలు హోరెత్తించారు.

## అవినీతి సొమ్మును కక్కిస్తాం



(మొదటి తరువాయి)

సాధింపు చర్యలకు తాము పాల్పడమని, చట్ట ప్రకారమే అన్ని జరుగుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కమిటీల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని, ఒక్కో కమిటీ- రిపోర్ట్ వచ్చాక దోషులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎఫ్ - 1 రేసులో క్యాబినెట్ తీర్మానం లేకుండా విదేశీ కంపెనీలకు ఇవ్వడం.. ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్ పార్టీకి వచ్చినట్లు- ఆధారాలు ఉన్నప్పుడు ఎవరు ఆపినా వారి అరెస్టులు ఆగవని ఆయన స్పష్టం చేశారు.

## పొరుగుదేశాల్లో ఏం జరుగుతందో చూడండి

- అందుకే మన రాజ్యాంగం పట్ల మేం గర్విస్తున్నాం
- గవర్నర్ల కేసు సందర్భంగా చీఫ్ జస్టిస్ ఆసక్తికర వ్యాఖ్య



**న్యూఢిల్లీ**

సుప్రీంకోర్టు బిల్లులను గవర్నర్లు పెండింగ్‌లో పెట్టే అంశాన్ని విచారిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్, బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాత్మక సంఘటనలను ప్రస్తావించింది. బుధవారం సుప్రీంకోర్టులో ఏప్రిల్ 12న ఇచ్చిన ఉత్తర్వులపై విచారణ జరిగింది. రాష్ట్రలు రూపొందించి బిల్లును క్లియర్ చేయడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును నిర్ణయిస్తూ సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులను ఇచ్చింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు భారత రాజ్యాంగాన్ని ప్రస్తావిస్తూ.. ప్రజా ప్రాముఖ్యత లేదా ఏ విధంగానైనా ప్రజల్ని ప్రభావితం చేసే ఏదైనా చట్టంపై రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరే హక్కును నిర్వచించింది. 'మన రాజ్యాంగం పట్ల మేమే గర్విస్తున్నాము' అని ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అన్నారు. మన పొరుగు దేశాల్లో ఏం జరుగుతుందో చూడండి, నేపాల్ పరిస్థితిని చూశామని సీజేఐ అన్నారు. నేపాల్‌లో జెన్ జెడ్ యువత చేస్తు హింసాత్మక ఆందోళనల్ని సుప్రీంకోర్టు ప్రస్తావించింది. బంగ్లాదేశ్ కూడా ఇలాంటివే జరిగాయని జస్టిస్ విక్రమ్ నాథ్ జోక్యం చేసుకున్నారు. గతేడాది బంగ్లాదేశ్‌లో హింసాత్మక అల్లర్ల కారణంగా, షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి, భారత్ పారిపోయి వచ్చారు. ఒక నెలకు పైగా బిల్లులను రిజర్వ్ చేసే విషయంలో గవర్నర్లను సమర్థిస్తూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమర్థించిన తర్వాత సుప్రీంకోర్టు నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లుల్లో 90 శాతం ఒక నెలలోపే గవర్నర్లు క్లియర్ చేస్తారని తుషార్ మెహతా కోర్టుకు వెల్లడించారు. 1970 నుంచి 2025 వరకు 20 బిల్లులు మాత్రమే రిజర్వ్ చేయబడ్డాయని కోర్టుకు తెలియజేశారు. అయితే, ఈ గణాంకాలను తాము పట్టించుకోమని న్యాయమూర్తులు అన్నారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 7 బిల్లులను రిజర్వ్ చేయడంతో డీఎంకే ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రాల బిల్లుల ఆమోదంలో న్యాయస్థానం తనకు గడువు నిర్దేశిరచడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కోరిన అభిప్రాయం అంశమై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు బుధవారం వాదనలు కొనసాగాయి. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు.

## సంపాదకీయం

# ఎన్నాళ్లీ వివాదాలు..?



విమర్శలు.. వివాదాలు.. వైఫల్యాలు.. ఈ మూడింటినీ కలిపితే టీజీపీఎస్సీ అవుతుందేమో. అలా అనుకునేంతగా ఆ కమిషన్ తీరు కొనసాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీపీఎస్సీ అయినా, ఇప్పుడు తెలంగాణలో టీజీపీఎస్సీ అయినా ఇదే ఒరవడి కొనసాగుతోంది. ఫలితంగా లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు అగమ్య గోచరమవుతోంది. గ్రూప్-1 పోస్టుల భర్తీకి సంబంధించి టీజీపీఎస్సీ జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మంగళవారం వెలువరించిన తీర్పు ఆ కమిషన్ పనితీరును మరో సారి ప్రశ్నార్థకం చేసింది. మెయిన్స్ పరీక్షా పత్రాలను తిరిగి మూల్యాంకనం చేయాలంటూ ఈ సందర్భంగా కోర్టు ఆదేశించింది. ఇప్పటికే ప్రకటించిన తుది మార్కుల జాబితాతో పాటు జనరల్ ర్యాంకింగ్ లిస్టులను రద్దు చేయటంతో అభ్యర్థుల ఆందోళన తారాస్థాయికి చేరింది. మెయిన్స్ అభ్యర్థుల పేపర్లను మూల్యాంకనం చేసి, అర్హుల జాబితాలను ప్రకటించాలంటూ న్యాయ స్థానం ఆదేశించటంతో వారు రోడ్డెక్కి తమ తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు.

వాస్తవానికి టీజీపీఎస్సీ ఇలా వివాదాల్లో చిక్కుకోవటం కొత్తేమీ కాదు. తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ హయాంలోనూ ఆ కమిషన్ పని విధానంపైన తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లో టీజీపీఎస్సీ తప్పిదాల వల్ల రెండుసార్లు ప్రిలిమ్స్ రద్దు కావటంలో నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయింది. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు సంబంధించి కూడా ఇలాంటి విమర్శలనే అది మూటగట్టుకోవటం గమనార్హం. హాల్ టిక్కెట్ల పంపిణీ నుంచి మూల్యాంకనం వరకూ అన్నీ వివాదాస్పద నిర్ణయాలే తీసుకున్నారనే ఆరోపణలను కమిషన్ ఎదుర్కొంటోంది. నిబంధనలు, సూత్రాలను అది పూర్తిగా ఉల్లంఘించింది. మూల్యాంకనానికి సంబంధించిన వివరాలను పరిశీలిస్తే సోషియాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సు సబ్జెక్టులకు ప్రత్యేక ప్రొఫెసర్లు, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలపై ప్రత్యేక అవగాహన ఉన్నవారు, జనరల్ అంశాలపై పట్టున్న వారు ప్యానెల్‌లో లేనే లేరన్నది అభ్యర్థుల వాదన. అదీగాక చాలాకాలం క్రితమే ఉద్యోగవిరమణ చేసిన రీడర్లు, ప్రొఫెసర్లను ప్యానెల్‌లో చేర్చుకోవటం శోచనీయం. పైగా అనేకమంది ఉన్నత విద్యావంతులు, కార్పొరేట్ ఉద్యోగాలకు రాజీనామా చేసిన వారు సైతం రాసిన ఈ పరీక్షలకు, వారికి వచ్చిన మార్కులకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. వారిలో చాలామందికి పదిలోపే మార్కులు రావటం గమనార్హం. ఈ పరిణామాలన్నీ అంతిమంగా లక్షలాది రూపాయలు పోసి, కోచింగ్ సెంటర్లలో ప్రిపేర్ అయిన నిరుద్యోగుల ఆశలను వమ్ముచేశాయి. పారదర్శకంగా నియమాకాలు చేపట్టాల్సిన టీజీపీఎస్సీ, దానికి భిన్నంగా వివాదాలకు కేంద్ర బిందువుగా మారటం ఇక్కడ కొసమెరుపు. కాగా ఇక్కడ కేవలం టీజీపీఎస్సీని మాత్రమే తప్పుబట్టటానికి లేదు. గత బీఆర్ఎస్ సర్కారు చేసిన తప్పులను సరిచేసి టీజీపీఎస్సీని యూపీఎస్సీ తరహాలో సరిదిద్దుతామంటూ కాంగ్రెస్ పార్టీ, ఆ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేకసార్లు నిరుద్యోగులకు హామీనిచ్చారు. ఈ క్రమంలో గతాను భవాలను దృష్టిలో ఉంచుకుని, టీజీపీఎస్సీ పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించి, లోపాలను సరిదిద్దాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయలేదు. మూల్యాంకనానికి నిపుణులైన ప్రొఫెసర్లను నియమించటం, తెలుగు, ఇంగ్లీషు పేపర్లను అదే మాద్యమాలకు సంబంధించిన వారితో మూల్యాంకనం చేయించటమనే నిబంధనలకు తిలోదకాలిస్తున్నా సర్కారు చూస్తూ ఊరుకుందే తప్ప, టీజీపీఎస్సీకి సరైన దిశా నిర్దేశం చేసి, గాడిన పెట్టలేదు. ఫలితంగా చరిత్ర మళ్లీ పునరావృతమైంది. అభ్యర్థులకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరవాలి. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలపై తక్షణమే విచారణకు ఆదేశించి, తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. సబ్జెక్టు నిపుణులతోనే జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి. తద్వారా పోస్టుల భర్తీకి ఎలాంటి అడ్డంకులు లేకుండా నియామకాలను పారదర్శకంగా చేపట్టాలి. తద్వారా అత్యున్నత స్థాయి కమిషన్‌గా టీజీపీఎస్సీని తీర్చిదిద్దాలి. లేదంటే నిరుద్యోగ యువత ప్రభుత్వాన్ని, కమిషన్‌ను క్షమించదుగాక క్షమించదు.

# తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానం

### సీఎం, డిప్యూటీ సీఎంలను అభినందించిన టీపీసీసీ చీఫ్‌మరియు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి.





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కలను టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ,తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి అభినందించారు. ఈ మేరకు వారికి బుధవారం వేర్వేరుగా లేఖలు రాశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం రూ.3.87 లక్షలుగా నమోదు కావడంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. ఆర్థిక క్రమశిక్షణ, సమ్మిళిత ఆర్థిక విధానాలతో వ్యవసాయం, పరిశ్రమలు, సేవా తదితర రంగాల్లో సమతుల్యతను పాటిస్తూ రైతుల రుణమాఫీ, సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయడంతో జాతీయ స్థాయిలో రాష్ట్రం గుర్తింపు పొందడానికి అవకాశం ఏర్పడిందన్నారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలువడం రాష్ట్రంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు గర్వకారణమని తెలిపారు.

# పసిబిడ్డను ఫ్రిడ్జ్‌లో పెట్టి నిద్రపోయిన బాలింత.. అందుకు కారణం అదేనట..!

**మొరాదాబాద్ ప్రజా స్వేచ్ఛ**

మొరాదాబాద్‌కు చెందిన 23 ఏళ్ల మహిళ 15 రోజుల క్రితం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఆమె వింతగా ప్రవర్తించడం మొదలుపెట్టింది. దాంతో ఆమె దెయ్యం పట్టిందని కుటుంబసభ్యులు క్షుద్రపూజలు చేయించారు. దాంతో ఆమె ప్రవర్తన మరింత వింతగా మారింది. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం ఆకలితో ఏడుస్తున్న బిడ్డకు పాలుపట్టకుండా ఫ్రిడ్జ్‌లో పెట్టి తాను నిద్రపోయింది. బిడ్డ ఏడుపు మరింత ఎక్కువ కావడంతో అతడి నానమ్మ వచ్చి చూసేసరికి ఫ్రిడ్జ్‌లో ఉన్నాడు. కోడలు హాయిగా నిద్రపోతూ కనిపించింది. వెంటనే బాలుడిని బయటికి తీసిన అతడి నానమ్మ కుటుంబసభ్యులతో కలిసి హుటాహుటిన ఆస్పత్రికి తరలించింది. పరిశీలించిన వైద్యులు బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని చెప్పారు. అనంతరం తల్లిని కూడా వైద్యులకు చూపించగా పరీక్షలు చేసి



ఆమె 'పోస్ట్‌పార్టం సైకోసిస్ ' తో బాధపడుతున్నారని నిర్ధారించారు. పోస్ట్‌పార్టం సైకోసిస్ అంటే ప్రసవానంతరం అత్యంత అరుదుగా వచ్చే మానసిక సమస్య అని చెప్పారు. చాలామంది మహిళలు ప్రసవం తర్వాత కొంత అయోమయానికి గురవుతారని, అయితే ఆ అయోమయం కొన్ని రోజులు మాత్రమే ఉండి, తర్వాత సాధారణ స్థితికి చేరుకుంటారని వైద్యులు తెలిపారు. కానీ పోస్ట్‌పార్టం సైకోసిస్ అనే రుగ్మత అలా కాదని, ఇది చాలా తీవ్రమైన మానసిక సమస్య అని చెప్పారు. ఈ సమస్య మరింత ముదిరితే తల్లీబిడ్డల ప్రాణాలకే ప్రమాదమని వెల్లడించారు.ప్రసవం తర్వాత కుటుంబసభ్యులు బాలింతను పెద్దగా పట్టించుకోకపోవడం, నిర్లక్ష్యంగా ఉండటం వల్ల ఈ సమస్య వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెప్పారు. బాలింత భావోద్వేగాలను అదుపులో ఉంచేందుకు కుటుంబసభ్యుల నుంచి కావాల్సినంత మద్దతు అవసరమని చెప్పారు. మహిళలు పోస్ట్‌పార్టం సైకోసిస్ బారినపడితే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని, లేదంటే సమస్య మరింత జఠిలమయ్యే ప్రమాదం ఉంటుందని తెలిపారు.

# ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం

**మరోసారి కుప్పకూలిన ప్రభుత్వం**
**ఊపందుకుంటున్న బ్లాక్ ఎవ్రిథింగ్ ఉద్యమం**

**పారిస్ ప్రజా స్వేచ్ఛ**

ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం తీవ్రతరమవుతోంది. ప్రధాని ఫ్రాంకోయిస్ బేరే తన పదవికి రాజీనామా చేశారు. ఫ్రాంకోయిస్ ప్రభుత్వంపై చట్టసభలో సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం గెలుపొందడంతో ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో దేశాధ్యక్షుడు ఎమ్మానుయేల్ మాక్రాన్ కేవలం 12 నెలల వ్యవధిలోనే నాలుగో ప్రధానిని నియమించాల్సి వచ్చింది. రక్షణ మంత్రి సెబాస్టియన్ లెకోర్ను ఫ్రాన్స్ తాజా ప్రధానిగా నియమితులయ్యారు. మరోవైపు ఫ్రాన్స్‌లో 'బ్లాక్ ఎవ్రిథింగ్' (ప్రతిదీ బ్లాక్ చేయి) పేరిట మొదలైన నిరసనోద్యమం ఊపందుకుంటోంది. వాస్తవానికి ఈ ఉద్యమానికి గత



సంవత్స రమే అంకురార్పణ జరిగింది. దేశంలో ఎన్నికలు నిర్వహించాలని మాక్రాన్ తీసుకున్న నిర్ణయం ప్రజాగ్రహానికి కారణమైంది. రాజధాని పారిస్ సహా పలు నగరాలలో ప్రజలు రోడ్లను దిగ్బంధించి తన నిరసన తెలిపారు. వాహనాలు, నివాస గృహాలకు నిప్పు పెట్టారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. మాక్రాన్‌పై ఒత్తిడి తేవడికి నిరసనకారులు పోలీసులపైనే తిరగబడుతున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. బస్సులను కూడా తగలబెట్టారు. రైళ్లను నిలిపివేశారు. విద్యుత్ లైన్లను ధ్వంసం చేశారు. సోషల్ మీడియా, ఎన్‌క్రిప్టెడ్ ఛాట్‌ల ద్వారా వ్యాప్తి చెందుతున్న ఈ నిరసనలకు ప్రస్తుతానికి ఎవరూ నాయకత్వం వహించడం లేదు. ఎక్కడికక్కడ ప్రజలే ఉద్యమంలో భాగస్వాములవుతున్నారు. ప్రభుత్వం ఏకంగా 80 వేల మంది పోలీసులను మోహరించినప్పటికీ నిరసనలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. నూతన ప్రధానిని నియమించినప్పటికీ ఆందోళనలు చల్లారడం లేదు. బడ్జెట్ కోతలపై ప్రజాగ్రహం మిన్నుముడుతోంది. దేశవ్యాప్తంగా 300 మంది నిరసనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు.

www.prajaswecha.com
ప్రజా స్వేచ్ఛ PRAJA SWECHA

# మన బస్తీ బాట అంటు ప్రజాసమస్యల పై పోరెత్తిన మారబోయిన రవి యాదవ్

ప్రజా స్వేచ్ఛ శేరి లింగంపల్లి ప్రతినిధి (అశోక్)

శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ అండర్ పాస్ బిడ్జిలో నిలిచిపోయిన మురికి నీటిని తొలగించాలని నిరసిస్తూ బుధవారం బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మారబోయిన రవి యాదవ్ ఆధ్వర్యంలో మహిళలు యువకులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు, ముందుగా ఉదయం తారా నగర్ లోని తుల్జా భవాని ఆలయంలో రవి యాదవ్ మహిళలు పురుషులతో కలిసి పూజలు నిర్వహించారు, శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమస్యలు ఉండకుండా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన తుల్జా భవాని అమ్మవారికి మొక్కుకున్నారు,అక్కడినుండి శేరిలింగంపల్లి రైల్వే బ్రిడ్జి వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు, అక్కడి నుండి పాపి రెడ్డి కాలనీ చందానగర్ అండర్పాస్ రైల్వే బ్రిడ్జి వరకు పాదయాత్ర తో వచ్చి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి. స్థానిక ఎమ్మెల్యే కార్పొరేటర్ పనితీరు బాగాలేదని చందానగర్ అండర్పాస్ రైల్వే బ్రిడ్జి



సమస్య పూర్తి పరిష్కారం కావాలని కోరారు, మున్సిపాలిటీ వాళ్లు పాటించుకోవట్లేరు, ప్రభుత్వం పాటించుకోవట్లే, మరి మా బతుకులకి విలువ లేదా అని ఆవేదన పడుతున్నారు పాపిరెడ్డి ప్రజలు, కెసిఆర్ తెచ్చిన పదేండ్ల పాలనలో చేసిన రోడ్డులో ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసి కాంగ్రెస్ చేసింది అని చెప్పుకొచ్చారు, బి ఆర్ ఎస్ వాళ్లు వచ్చి ఫోటోలు దిగి ఫోతున్నారు అని అన్నారు మరి ఇపుడు కనులకి కనిపిస్తలేదా అని కార్పొరేటర్ ని ఎమ్మెల్యే గాంధీని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమం లో కే.ఎన్.రాములు, స్వామీనాథ్,వెంకటరెడ్డి, చారీ, శ్రీకాంత్ యాదవ్, శ్రీశైలం యాదవ్,గడ్డం శ్రీనివాస్,సురేష్ యాదవ్,గడ్డం మహేష్, గంగాధర్ గౌడ్, కొండకల శ్రీనివాస్, నవీన్ గౌడ్, సాయి నందన్ ముదిరాజ్, పవన్, స్వామి, రాజు గౌడ్, వడ్డే శ్రీనివాస్, జంగయ్య, బాలరాజు, శంకర్, మున్నా, రాజు గౌడ్ ,శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ, రవి, మజీద్, వెంకటేష్,నర్సింహా, రామదేవి, స్వరూప, శశికల, దివ్య, నిరూప, అనిత, రాజేశ్వరి,ఆశ, నాగమణి

# నూతన రిజర్వాయర్లతో ప్రతి ఇంటికి స్వచ్ఛ జలాలు

-పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
-అమీన్పూర్ బంధం కొమ్ములో నూతన రిజర్వాయర్ నుండి మంచినీటి సరఫరా ప్రారంభం
-హాజరైన ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి

అమీన్పూర్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నూతన రిజర్వాయర్లు నిర్మించడంతోపాటు ప్రతి ఇంటికి స్వచ్ఛమైన జలాలు అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బంధం కొమ్ము శ్రీకృష్ణ బృందావన్ కాలనీలో 11 కోట్ల 32 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన 2 మిలియన్ లీటర్ల GLSR రిజర్వాయర్ పైపులైన్ వ్యవస్థను బుధవారం మెదక్




ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారుఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 300కు పైగా కాలనీలతో అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తున్న అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్యకు ఇబ్బందులు తలెత్తకుండా ఐదు రిజర్వాయర్లు నిర్మించామని తెలిపారు.నూతన కాలనీలలో సైతం మంచినీటి పైపులైన్లు వేయడంతో పాటు ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తావినీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. నీటి కొరతకు ప్రత్యేకగా నిలిచి అమీన్పూర్ మున్సిపాలిటీలో నేడు ప్రతి ఇంటికి మంచినీరు అందించిన ఘనత తమకే దక్కుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పూర్తి సహాయ సహకారాలతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారుఈ కార్యక్రమంలో జలమండలి జిఎం సుబ్బారాయుడు, డీజీఎం చంద్రశేఖర్,ఏఈ పూర్ణేశ్వరి,మాజీ కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాంధీ సరోవర్‌కు రక్షణ భూములు బదలాయించండి

రక్షణశాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

చిట్యాల ఐలమ్మకు నివాళ్లు



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ


తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం నాడిక్కడ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మూసీ, ఈసా నదుల సంగమ స్థలిలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ రెండు నదుల సంగమ స్థలిలో గాంధీసర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం చేపడతామని, ఇందుకు అక్కడ ఉన్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ల్యాండ్ స్కేప్, ఘాట్లు, శాంతి విగ్రహం మ్యూజియం నిర్మిస్తామని వివరించారు. సమావేశం లో ఎంపీలు పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ.వి.నరసింహారెడ్డి, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయకర్త గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**అణచివేతపై ధిక్కార పతాక చిట్యాల ఐలమ్మ**

అణచివేత.. దమనకాండపై పోరాడిన ధిక్కార పతాక చిట్యాల ఐలమ్మ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి సీఎం రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ గడ్డపై దొరల అహంకారానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 80ఏండ్ల క్రితమే జంగ్ సైరన్ ఊదిన యోధురాలు ఐలమ్మ అని అన్నారు. సమ్మక్క. సారక్క చిట్యాల ఐలమ్మల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

# పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం

–కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు




మెట్ పల్లి ప్రజా స్వేచ్ఛ

పేద ప్రజలకు ముఖ్య మంత్రి సహాయ నీది ఒక వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం పట్టణం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో మెట్ పల్లి పట్టణం, వివిధ మండలాల కు చెందిన లబ్ధిదారులు కు మంజూరైనా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ మెట్ పల్లి పట్టణం తోపాటు ఇతర మండలం కు చెందిన 19 మందికి 7.33 లక్షలు విలువ గల చెక్కులను పంపిణి చేసినట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుండన్నారు. ఆసుపత్రి లో ఖర్చులు పాలైన పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు కొంత మేర ఆర్థికంగా అండగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, యూత్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు నూతుల రవీందర్ రెడ్డి, జాఖీర్, లింగారెడ్డి, మహేందర్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులు

– టీచర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



ప్రజా స్వేచ్ఛ వలిగొండ (ప్రతినిధి

సమాజానికి నిజమైన దిక్సూచి, మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని వారిని సముచితంగా గౌరవించుకోవడం మనందరి కర్తవ్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోవికాసం సిద్ధిస్తుందని,అది ఉపాధ్యాయుల ద్వారానే అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు ఎంఈఓ సుంకోజు భాస్కరాచారి ఎంపీడీవో జి జలంధర్ రెడ్డి.ఇంద్రసేనారెడ్డి బంధారపు లింగస్వామి. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



ప్రజా స్వేచ్ఛ వలిగొండ (ప్రతినిధి)

మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులతో మాట్లాడారు మండలంలోని పలు పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు గ్రామాలలో ఉన్నటువంటి సమస్యలను గ్రామ కార్యదర్శులను అడిగి తెలుసుకొని అతి త్వరలో సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను త్వరగా ఇండ్లు పూర్తి చేసుకునేలా అధికారులకు సూచించారు ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి జలంధర్ రెడ్డి ఎమ్మార్వో బి దశరథ నాయక్ ఎంపీఓ కేదార్ ఈశ్వర్ స్పెషల్ ఆఫీసర్లు. గ్రామపంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి.ఐలమ్మకు నివాళులు అర్పించిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిమాజీ మంత్రి



**ప్రజా స్వేచ్ఛ వనపర్తి. జిల్లా ప్రతినిధి.**
తెలంగాణ వీరనారి చాకలి.ఐలమ్మ వర్ధంతి సందర్భంగా, ఆమె విగ్రహానికి పూలమాలలు సమర్పించి, నివాళులు అర్పించారు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమికోసం, భుక్తికోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి.ఐలమ్మ చేసిన పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాంది పలికిన ఐలమ్మ బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు.నివాళులు అర్పించిన వారిలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్,పలుస.రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్,గంధం.పరంజ్యోతి,మాజీ కౌన్సిలర్స్ బండారు.కృష్ణ,ప్రేమ్ నాథ్ రెడ్డి, స్టార్.రహీమ్, సూర్యవంశం.గిరి,జోహెబ్ హుస్సేన్,హేమంత్ ముదిరాజ్, చిట్యాల.రాము,వజ్రాల.రమేష్, సాయిలీలా,కవిత,ఆటో యూనియన్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ట్రాన్జెడర్స్ ను సమాజం గౌరించాలి

పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళ వేదిక అధ్యక్షులు




**ప్రజా స్వేచ్ఛ .వనపర్తి.జిల్లా ప్రతినిధి.**
వనపర్తి జిల్లా,ప్రభుత్వ ఆసుపత్రి వనపర్తి అద్వర్యములో, ట్రాంజెడర్స్ కు ఆటల పోటీని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ పాల్గొని ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ ప్రోగ్రాం లో శంకర్ గౌడ్ మాట్లాడుతు, ట్రాంజెడర్స్ ను సొసైటీ గౌరవించాలన్నారు. సమాజంలో వారు కూడా మనలో వారిగా గుర్తించాలన్నారు.విద్యా ,వైద్య,అన్నీ రంగాల్లో ప్రోత్సహించాలి అన్నారు. చదువులో వారిని ప్రోత్సహించాలన్నారు. రాజ్యాంగం కుడా వారికీ హక్కులు కల్పించిందన్నారు. ఈ ప్రోగ్రాం లో ఆసుపత్రి సిబ్బంది బండారు శ్రీనివాస్,రవీందర్ రెడ్డి, ఉదయ్కుమార్, ఇబ్రహీం,ట్రాంజర్స్ అధ్యక్షురాలు రమ్యరెడ్డి, పద్మమ్మ, భాగ్యలక్ష్మి, కవిత, కల్పన, పాల్గొన్నారు.రన్నింగ్ కాంపిటీషన్ లో ఫస్ట్ ప్రైజ్ జోయా,సెకండ్ ప్రైజ్ ,లక్కీ గెలుపొందారు.

## మియాపూర్ చౌరస్తా లో సిఎం అర్ షాపింగ్ మాల్ ను ప్రారంభించిన పీఏసీ చైర్మన్ ఆర్కెపూడి గాంధీ



**ప్రజా స్వేచ్ఛ శేరి లింగంపల్లి ప్రతినిధి (అశోక్)**
మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ చౌరస్తా లో నూతనంగా ఏర్పాటు చేసిన సి ఎం అర్ షాపింగ్ మాల్ ను గౌరవ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ , ప్రముఖ సినీతార మృణాల్ ఠాకూర్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి గార్ల తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఈ కార్యక్రమంలో సి ఎం అర్ అధినేత వెంకటరమణ నాయకులు మాధవరం జగదీశ్వర్ రావు, మాధవరం రామారావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,గంగాధర్, హరి కృష్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

# నిష్పక్షపాతంగా వ్యవహరించండి

-ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ విజ్ఞప్తి
-భారత్, అమెరికాలు సహజ భాగస్వాములన్న ప్రధాని వ్యాఖ్యలపై ఎద్దేవా





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**
ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ పార్టీ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. రాజ్యసభ చైర్మన్‌గా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరింది. ఈమేరకు ఆ పార్టీ జనరల్ సెక్రటరీ, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేష్ బుధవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ సమయంలో దేశ ప్రథమ ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విలువైన మాటలను ఆయన గుర్తు చేశారు. 1952 మే 16న రాజ్యసభ తొలి సమావేశంలో సర్వేపల్లి మాట్లాడుతూ.. "నేను ఏ పార్టీకి చెందిన వాడిని కాదు.. సభ సంప్రదాయాలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఉన్నత విలువలు కాపాడాల్సిన బాధ్యత నాపై ఉంది" అని పేర్కొన్నారని జైరాం వివరించారు. ఇలా తాను చెప్పినదాన్ని సర్వేపల్లి తుచ తప్పకుండా ఆచరించారని గుర్తుచేశారు. కాగా భారత్, అమెరికా సహజ భాగస్వాములని మోదీ పేర్కొనడంపై బుధవారం కాంగ్రెస్ పార్టీ స్పందించింది. అదే నిజమైతే ట్రంప్ తాను వాణిజ్యాన్ని ఆయుధంగా ఉపయోగించి భారత్-పాకిస్థాన్‌లను కాల్పుల విరమణకు ఒప్పించానని 35 సందర్భాల్లో ఎలా పేర్కొన్నారని ప్రశ్నించింది. ఇది కూడా సహజ భాగస్వామ్యమేనా.. అని ఎద్దేవా చేసింది.

## రైతు రుణామాఫీ రిలే నిరాహారదీక్షకు సంఘీభావము తెలిపిన వై యస్ ఆర్.



**ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ప్రతినిధి**
ఘట్కేసర్ ఉమ్మడి మండల రైతు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు మేడ్చల్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగం ప్రభుత్వం చేతిలో మోసపోయిన విధానాన్ని ఎండగట్టారు.ఘట్కేసర్ రైతు సహకార సంఘం పరిధిలో 1200 మంది రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఒకట్టినర సంవత్సరాల కాలం గడుస్తున్నప్పటికీ సరైన విధంగా ఈ సమస్య పరిష్కారానికి పూనుకోకపోవడం భావ్యం కాదురైతు సహకార సంఘం అధ్యక్షుడు మరియు డైరెక్టర్లు ఇప్పటికీ అనేక సార్లు మంత్రులను కలిసినాము అంటూ కాలయాపన చేయడం తప్పించి రుణమాఫీ చేయించలేకపోయారు మలి దశ తెలంగాణ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఈ సమస్యపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.నేను ఈ రుణమాఫీ అంశంపై ఇప్పటికీ రైతులతో కలిసి ట్రాకర్ల యాత్ర ద్వారా కలెక్టర్ కు సమస్య తీవ్రతను తెలుపడం జరిగింది రాబోయే రోజుల్లో నిర్వహించే రైతుల దీక్షలలో ముందుండి నడపాల్సింది రైతు సహకార సంఘం అధ్యక్షుడు మరియు డైరెక్టర్లే ఎమ్మెల్యేగా ఉన్న మల్లారెడ్డికనుమరుగైపోయాడు రైతు సమస్యలపై పోరాటం చేస్తున్న దీక్షను భగ్నం చేసేందుకు కుట్ర చేస్తే ఊరుకునేది లేదు ఈ సమస్య పరిష్కారం కొరకు ఉద్యమ ఉధృతిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు శంకరప్ప డైరెక్టర్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.


## చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం లో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్




**ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిధి(అశోక్)**
చందానగర్ డివిజన్ లోగల శివాజీ నగర్ లో చిట్యాల చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూచిట్యాల చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలని, బహుజన వర్గాల స్ఫూర్తి ప్రదాత, మహిళా చైతన్యానికి ప్రతీక అని కొనియాడుతూ స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, రవి యాదవ్, గోపాల్ యాదవ్, రాములు, పర్శ రాములు, ప్రతాప్, భీమేష్,హనుమంతు, తెలంగాణ ఈశ్వర రజక సంక్షేమ సంఘం చందానగర్ శివాజీ నగర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కదిరే రాములు యాదవ్,కదిరే జంపన్న యాదవ్ ల తల్లి దశదిన కర్మకు హాజరైన

-డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు



**ప్రజా స్వేచ్ఛ .వనపర్తి. జిల్లా ప్రతినిధి.**
వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు యాదవ్, మాజీ కౌన్సిలర్ కదిరే జంపన్న,తల్లి కదిరే నాగమ్మ దశదిన కర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్. జిల్లెల.చిన్నారెడ్డి.కదిరే రాములు యాదవ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరం ఆ బాధ నుంచి కోలుకొని ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్,రాష్ట్ర మైనార్టీ నాయకులు అక్తర్, వనపర్తి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జానకి రాములు,వనపర్తి మాజీ ఎంపీపీ.శంకర్ నాయక్, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి.పెంటన్న యాదవ్,వనపర్తి జిల్లా ఏఐపిసి ఉపాధ్యక్షులు నాగార్జున,వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియాకో కోఆర్డినేటర్ గడ్డం వినోద్ యాదవ్, వనపర్తి మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల చంద్రశేఖర్,వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాబా,వనపర్తి మండల్ ఎన్ఎస్ యుఐ అధ్యక్షుడు ఎ.చరణ్ రాజ్, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి. బాలరాజ్,కె. వెంకటేష్,ఎ.రవి, రామరాజ్, ఆనంద్ సాగర్,తదితరులు పాల్గొన్నారు.

## 12 నా జిల్లా యోగాసనపోటీలు.



**ప్రజా స్వేచ్ఛ బైంసా ప్రతినిధి**
యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 12న శుక్రవారం తానుర్ మండల కేంద్రంలోని డిస్కవరీ డ్రీమ్స్ స్కూల్ లో జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కదమ్ మోహన్ రావు పటేల్, జనరల్ సెక్రటరీ ఉప్పు రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ పోటీలలో 8 సంవత్సరాల వయసు నుండి 80 సంవత్సరాల వయస్సు ఉన్న స్త్రీ పురుష అభ్యర్థులు పాల్గొనవచ్చని సూచించారు, పాల్గొనే అభ్యర్థులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9640463434ఈ నంబర్ ని సంప్రదించాలని తెలిపారు

## నూతన రెస్టారెంట్ ను ప్రారంభించిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**ప్రజా స్వేచ్ఛ**
**శేరిలింగంపల్లి ప్రతినిధి(అశోక్)**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్ ఇందిరా నగర్ మెయిన్ రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సంప్రద రెస్టారెంట్ ను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. యాజమానులు భరత్ కుమార్ రెడ్డి, దయాకర్ బాబు లకు శుభాకాంక్షలు తెలియజేసి వారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని వారు కోరుకున్నారు. ఈ రెస్టారెంట్ మూడు పువ్వులు ఆరు కాయలుగా అంచలంచలుగా ఎదిగి మరెన్నో బ్రాంచ్ లను ప్రారంభించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, గోపాల్ యాదవ్, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ సమావేశం


**ప్రజా స్వేచ్ఛ**
**10 మెదక్ జిల్లా ప్రతినిధి (రాము)**
గౌరవ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు, గౌరవ ఛైర్పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమ గారి సూచనలతో, నేడు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, మెదక్ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ కు సంబంధించిన ముఖ్యమైన సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్. ఎం. శుభవల్లి, సెక్రటరీ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, మెదక్



హాజరయ్యారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జ్ రుబీనా ఫాతిమా, జూనియర్ సివిల్ జడ్జ్ సిరి సౌజన్య, మొబైల్ కోర్ట్ మెజిస్ట్రేట్ ఊరే సాయి ప్రభాకర్ పాల్గొన్నారు. నేషనల్ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించిన ప్రాధాన్యత, ప్రజలకు అందించే ఉచిత న్యాయ సేవల అంశాలపై ఈ సమావేశంలో చర్చించబడింది. వివిధ కేసుల పరిష్కారాలపై వ్యూహాలు రూపొందించగా, ప్రజలకు త్వరిత న్యాయం అందించాలనే లక్ష్యంతో సమిష్టిగా చర్యలు తీసుకునే విధంగా తీర్మానించబడింది. జిల్లా న్యాయ సేవా సంస్థ తరఫున నిర్వహించిన ఈ కార్యక్రమం సజావుగా సాగింది.

# బిజినెస్

## రాణించిన ఐటీ, ఫైనాన్షియల్ షేర్లు.. లాభాల్లో ముగిసిన మార్కెట్లు..!



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. ఐటీ, ఫైనాన్సియల్, రియాలిటీ షేర్లు రాణించాయి. ఆటో, మీడియా స్టాక్స్ లాభాల స్వీకరణకు దిగడంతో ఇంట్రాడేలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,504.36 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,235.42 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,643.88 పాయింట్ల వరకు చేరింది. చివరకు 323.83 పాయింట్ల లాభంతో 81,425.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104.5 పాయింట్లు పెరిగి 24,973.10 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.7శాతం వరకు పెరిగాయి.నిఫ్టీలో భారత్ ఎలక్ట్రానిక్స్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్ లాభాలను ఆర్జించాయి. అయితే, ఎంఅండ్ఎం, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, మారుతి సుజుకీ, టాటా మోటార్స్ నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే ఆటో ఇండెక్స్ ఒకశాతం, ఐటీ ఇండెక్స్ 2.6శాతం వృద్ధిని నమోదు చేసింది. పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2.2శాతం, రియాలిటీ ఇండెక్స్ ఒకశాతం దాకా పెరిగింది. అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ షేర్లు 16శాతం ర్యాలీ చేశాయి. అవంతి ఫీడ్స్ 15శాతం, కోస్టల్ కార్పొరేషన్ షేర్లు 20శాతం, గోకల్దాస్ ఎక్స్‌పోర్ట్స్ 4శాతం పెరిగాయి. వెల్స్పన్ లివింగ్ 8, అరవింద్ షేర్లు 4శాతం వృద్ధిని నమోదు చేశాయి.

## దిగివచ్చిన ఫ్యూచర్ గోల్డ్.. తులానికి రూ.1.09లక్షల దిగువకు..!

పసిడి ధరలు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇటీవల పెరుగుతూ వస్తున్నాయి. ట్రంప్ టారిఫ్, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, డాలర్ బలహీన నేపథ్యంలో ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా పెరిగాయి. రోజు రోజుకు ధరలు పెరుగుతూ జీవితకాల గరిష్ఠాలకు చేరాయి. తాజాగా భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశలు, విదేశీ మార్కెట్లలో బలహీనంగా ఉండడంతో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ధరలు బుధవారం రికార్డు స్థాయి నుంచి దిగివచ్చాయి. తులం ధర రూ.1.09లక్షల దిగువకు చేరాయి. అమెరికాలో అంచనా వేసిన దానికంటే తక్కువ ఎంప్లాయిస్‌మెంట్ డేటా ప్రపంచంలోని యూఎస్ ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలను రేకెత్తిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.ఈ వారం చివరలో విడుదలకానున్న ద్రవ్యోల్బణ డేటాను పెట్టుబడిదారులు జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. ఈ గణాంకాలు యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు వైఖరిపై సూచనలు ఇస్తాయని భావిస్తున్నారు. అక్టోబర్ డెలివరీకి బంగారం



ఫ్యూచర్స్ ధర రూ.230 తగ్గింది. పది గ్రాములకు రూ. 1,08,830కి చేరుకుంది. డిసెంబర్ డెలివరీకి సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ రూ.249 తగ్గి రూ.1,09,839కి తగ్గింది. కమోడిటీ మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఇటీవలి వరుస ర్యాలీల తర్వాత బంగారం ధరలు జీవనకాల గరిష్టానికి చేరాయి. విదేశీ మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ మధ్య లాభాల స్వీకరణకు మదుపరులు మొగ్గుచూపగా.. ఇది బంగారం ధరలపై ఒత్తిడి తెస్తున్నది. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధాని నరేంద్ర మోదీతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతి ఉంటుందని భావిస్తున్నారు. ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రధాని మోదీ 'ఎక్స్' పోస్ట్‌లో భారత్, యూఎస్ రెండుదేశాలు స్నేహితులని.. సహజ భాగస్వాములుగా పేర్కొన్నారు. మరో వైపు కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సుకు 3,679.02 డాలర్ల వద్ద స్థిరపడ్డాయి. ఈ సంవత్సరం ఇప్పటివరకు బంగారం ధరలు దాదాపు 40 శాతం పెరిగాయి. 2024లో 27 శాతం పెరుగుదలను నమోదు చేసిన తర్వాత ఔన్సుకు 3,700 మార్కును దాటయని ఆగ్‌మాంట్ పరిశోధన విభాగాధిపతి రెనిషా చైనాని తెలిపారు. సెంట్రల్ బ్యాంకుల ద్రవ్య విధానాలు, యూఎస్ డాలర్ బలహీనపడడం, ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు భారీగా బంగారం కొనడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక ఆందోళనలు బంగారానికి డిమాండ్ పెంచాయన్నారు. యూఎస్ సెంట్రల్ బ్యాంక్ ద్రవ్య విధానం సమీప భవిష్యత్‌లో బంగారం ధరల సెంటిమెంట్‌పై బలమైన సంకేతాలను ఇచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## అనిల్ అంబానీకి మరో షాక్.. ఈడీ కొత్త మనీలాండరింగ్ కేసు దాఖలు

ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ కి మరో షాక్ తగిలింది. ఆయనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసింది. రూ.2,929 కోట్ల మోసం కేసు లో అనిల్ అంబానీపై ఈడీ కొత్త మనీలాండరింగ్ కేసు దాఖలు చేసింది.రూ.2,929.05 కోట్ల రుణ మోసం కేసులో అనిల్ అంబానీపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఇటీవలే చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అనిల్ అంబానీపై కేసు కూడా నమోదు చేసింది. ఈ కేసులో అంబానీకి చెందిన సంస్థలపై సీబీఐ ఇటీవలే సోదాలు చేపట్టిన విషయం తెలిసిందే. సీబీఐ దాఖలు చేసిన ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ ఆధారంగా తాజాగా ఈడీ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రూ.3 వేల కోట్ల రుణ మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అనిల్ అంబానీని



ఇప్పటికే విచారించిన విషయం తెలిసిందే.

# స్పోర్ట్స్

## డెవెనేకు చివరి వరల్డ్ కప్..

### నలుగురు కొత్తవాళ్లకు ఛాన్స్..!

: రెండేళ్ల క్రితం పొట్టి వరల్డ్ కప్ గెలుపొందిన న్యూజిలాండ్ వన్డే ప్రపంచ కప్ వేటకు సిద్ధమైంది. వన్డే వరల్డ్ కప్ టోర్నీకి ఇంకా 20 రోజులే ఉండడంతో.. న్యూజిలాండ్ క్రికెట్ పటిష్టమైన స్క్వాడ్‌ను ప్రకటించింది. టీ20 వరల్డ్ కప్ అందించిన సోఫీ డెవినే కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. అయితే.. తొలిసారిగా నలుగురు కొత్తవాళ్లకు వరల్డ్ కప్ ఆడే అవకాశం కల్పించారు సెలెక్టర్లు. వీళ్లలో ఒకరు అన్‌క్యాప్డ్ ప్లేయర్ కాగా.. తక్కిన ముగ్గురు ఈ ఏడాదే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశారు.న్యూజిలాండ్ వరల్డ్ కప్ స్క్వాడ్‌లోని ఇంగ్లండ్ పర్యటనలో తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడారు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అయిన డెవాన్‌షైర్ 18 వికెట్లతో రాణించింది. ఆల్‌రౌండర్ అయిన తను బ్యాటుతోనూ చెలరేగి 266 రన్స్ కొట్టింది. ఇంగ్లిస్ బ్యాకప్ వికెట్ కీపర్‌గా చోటు దక్కించుకుంది. ఇక ఇల్లింగ్ విషయానికొస్తే.. శ్రీలంక, ఇంగ్లండ్ ఏ జట్లపై వికెట్ల వేట కొనసాగించింది.న్యూజిలాండ్ స్క్వాడ్ : సోఫీ డెవినే(కెప్టెన్), సుజీ బేట్స్, ఎడెన్ కార్సన్, ఫ్లోరా డెవాన్‌షైర్, ఇజీ గేజ్, మ్యాడీ గ్రీన్, బ్రూకే హల్లిడే, బ్రీ ఇల్లింగ్, పాలీ ఇంగ్లీస్(వికెట్ కీపర్), బెల్లా జేమ్స్, జెస్ కేర్, మిలే కేర్, రోస్‌మెరీ మైర్, జార్జియా పిమ్మర్, లీ తహుహు.





**2000లో తొలిసారి**

కెప్టెన్ సోఫీ డెవినేతో పాటు సీనియర్ సుజీ బేట్స్‌కు ఇది ఐదో వన్డే వరల్డ్ కప్. లీ తుహుహుకు నాలుగోది కాగా.. మ్యాడీ గ్రీన్, మేలియా కేర్‌లు మూడోసారి వరల్డ్ కప్ బరిలో ఉన్నారు. డెవినే సారథ్యంలోనే సారథ్యంలోనే న్యూజిలాండ్ తొలిసారి టీ20 వరల్డ్ కప్ ఛాంపియన్‌గా అవతరించింది. కెరీర్లో చివరి వరల్డ్ కప్ ఆడుతున్న వెటరన్ ఆల్‌రౌండర్ వీడ్కోలు కానుకగా జట్టుకు ట్రోఫీ అందించాని భావిస్తోంది.కివీస్ జట్టు 2000లో తొలిసారి వన్డే వరల్డ్ కప్ ఛాంపియన్‌గా అవతరించింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించి టైటిల్ విజేతగా నిలిచింది. చివరిసారిగా వైట్‌ఫెర్న్ టీమ్ 2009లో ఫైనల్ ఆడింది. ఈసారి.. భారత్, లంక వేదికగా జరుగునున్న వరల్డ్ కప్‌లో అక్టోబర్ 1న డిఫెండింగ్ ఛాంపియన్ ఆసీస్‌తో న్యూజిలాండ్ తలపడనుంది.

## అభిషేక్ సిక్సర్ల మోత.. 4.3 ఓవర్లలోనే మ్యాచ్ ముగించిన భారత్

పదిహేడో సీజన్ ఆసియా కప్‌ను భారత జట్టు అదిరపోయేలా ఆరంభించింది. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లో దడ పుట్టిస్తూ యూఏఈ కి ముచ్చెమటలు పట్టించిన టీమిండియా.. ప్రత్యర్థులకు వణుకు పుట్టించే విజయంతో టోర్నీలో ఘనంగా శు భారంభం చేసింది. తొలుత కుల్దీప్ యాదవ్ (4–7), శివం దూబే(4–3)ల విజృంభణతో ప్రత్యర్థి 57కే పరిమితం అవ్వగా.. స్వల్ప ఛేదనలో ఓపెనర్ అభిషేక్ శర్మ(30) సిక్సర్లతో చెలరేగాడు. శుభ్‌మన్ గిల్(19 నాటౌట్) సైతం దంచేయడంతో%ౌ% 4.3 ఓవర్లలోనే జయభేరి మోగించింది. 9 వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా గ్రూప్ ఏ నుంచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది.డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఆసియా కప్‌ను భారీ విజయంతో మొదలు పెట్టింది. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన టీమిండియా సంచలన బౌలింగ్ ప్రదర్శనతో ప్రత్యర్థికి దిమ్మతిరిగే షాకిచ్చింది. 58 పరుగుల ఛేదనలో ఓపెనర్ అభిషేక్ శర్మ తొలి బంతినే సిక్సర్‌గా మలిచాడు. ఆ తర్వాత బంతికి ఫోర్ బాదగా.. రెండో




ఓవర్లో శుభ్‌మన్ గిల్(19 నాటౌట్) ఫోర్, సిక్సర్ కొట్టడంతో చూస్తుండానే లక్ష్యం కరిగిపోయింది.జునైద్ సిద్దిఖీ వేసిన నాలుగో ఓవర్లో సిక్సర్ రాబట్టిన అభిషేక్.. ఆ తర్వాత బంతికి ఔటయ్యాడు. అతడు వెనుదిరిగే సరికి టీమిండియా స్కోర్.. 48/1. విజయానికి పది పరుగులు మాత్రమే అవసరం కాగా.. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (7 నాటౌట్) ఎదుర్కొన్న మొదటి బంతినే స్టాండ్స్‌లోకి పంపాడు. నాలుగో ఓవర్ మూడో బంతిని గిల్ బౌండరీకి తరలించగా.. యూఏఈ జట్టు దారుణంగా ఓడిపోయింది.

**కుల్దీప్.. దూబే పడగొట్టారిలా**

టాస్ గెలిచి బౌలింగ్ తీసుకున్న టీమిండియా యూఏఈని స్వల్ప స్కోర్‌కే కట్టడి చేసింది. మొదట ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఓపెనర్ అలీషాన్ షరుఫు(22)ను ఔట్ చేసి జట్టుకు తొలి వికెట్ అందించాడు. దూకుడుగా ఆడుతున్న అతడిని యార్కర్ కింగ్ క్లీన్ బౌల్డ్ చేయడంతో.. 26వద్ద ఆతిథ్య జట్టు మొదటి వికెట్ కోల్పోయింది. కాసేపటికే బంతి అందుకున్న వరుణ్ చక్రవర్తి ముహమ్మద్ జొహైబ్(2)ను డగౌట్ చేర్చాడు. ఆ తర్వాత కుల్దీప్ యాదవ్ (4–7), శివం దూబే(4–3)లు మ్యాజిక్ చేశారు.చైనామన్ బౌలర్ కుల్దీప్ విజృంభణతో%ౌ% 9వ ఓవర్లో రాహుల్ చోప్రా(3), కెప్టెన్ ముహమ్మద్ వసీం(19), హర్షిత్ కౌశిక్(2)లు వెనుదిరిగారు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే అక్షర్ పటేల్(13–1), దూబేలు మరో ఎండ్ నుంచి వికెట్ల వేట సాగించారు. 13వ ఓవర్లో రెండు వికెట్లు తీసిన దూబే ప్రత్యర్థిని ఆలౌట్ అంచున నిలిపాడు. చివరి వికెట్‌గా వచ్చిన హైదర్ అలీ(1)ని కుల్దీప్ ఔట్ చేయగా 57కే యూఈఏ ఇన్నింగ్స్ ముగిసింది.

## క్రికెటర్ పృథ్వీ షాకు కోర్టు జరిమానా

### యూట్యూబర్ సప్నాగిల్ వివాదం..




యూట్యూబర్ సప్నాగిల్ తో వివాదం కేసులో టీమ్‌ఇండియా క్రికెటర్ పృథ్వీ షాకు షాక్ తగిలింది. ఆయనకు కోర్టు ఫైన్ వేసింది. సప్నాగిల్ దాఖలు చేసిన పిటిషన్‌కు సమాధానం ఇవ్వకపోవడంతో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జూన్ 13న క్రికెటర్ తరఫున న్యాయవాదికి చివరి అవకాశం ఇచ్చినప్పటికీ.. ఆయన ఇంకా స్పందన దాఖలు చేయలేదని పేర్కొంది. ఈ మేరకు రూ.100 ఫైన్ కట్టాలని ముంబై దిండోషి సెషన్స్ కోర్టు ఆదేశించింది. అంతేకాదు, పృథ్వీ షాకు మరో అవకాశం కల్పిస్తూ.. తదుపరి విచారణ డిసెంబరు 16కి వాయిదా వేసింది.

**అసలేం జరిగిందంటే..?**

2023లో ఆంధేరి బార్‌లో పృథ్వీ షా, అతడి స్నేహితుడు అశిష్ యాదవ్‌లు తమతో గొడవ పడ్డారని.. ఇద్దరూ తమపై బేస్‌బాల్ బ్యాటుతో దాడి చేశారని సప్న గిల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరింది. కానీ, పోలీసులు పట్టించుకోలేదు. అయితే.. సప్న అనవసర రాద్ధాంతం చేస్తుందని, తనను కావాలనే ఇరికిస్తోందని షా సైతం ఆమెపై కంప్లైంట్ చేశాడు. దాంతో, సప్న ముంబై కోర్టును ఆశ్రయించింది.




# పండంటి బిడ్డకు జన్మనిచ్చిన లావణ్య త్రిపాఠి

నటుడు వరుణ్ తేజ్,లావణ్య త్రిపాఠి దంపతులు తల్లిదండ్రులు అయ్యారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో లావణ్య త్రిపాఠి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు చిరంజీవి కూడా 'మన శంకరవరప్రసాద్‌గారు' సెట్స్ నుంచి నేరుగా ఆసుపత్రికి వెళ్లి వరుణ్, లావణ్యలకు శుభాకాంక్షలు తెలిపారు. తాము తల్లిదండ్రులం కానున్నట్లు- వరుణ్ తేజ్ మేలో సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించనున్నాను. కమింగ్ సూన్' అనే క్యాప్షన్‌తో శుభవార్తను పంచుకున్నారు. తాజాగా వీరికి బాబు పుట్టడంతో మెగా ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. సెలబ్రిటీ-లు ఈ జంటకు విషెస్ చెబుతున్నారు. లావణ్య త్రిపాఠిని వరుణ్ తేజ్ ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. 2017లో 'మిస్టర్' సినిమా కోసం వరుణ్ - లావణ్య తొలిసారి కలిసి నటించారు. అప్పుడే ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. 2023 నవంబర్ 1న ఇటలీలోని టస్కానీ వేదికగా వీరిద్దరూ వివాహబంధంతో ఒక్కటయ్యారు.



# కిష్కిందపురి నచ్చకుంటే చిత్రసీమ వదిలేస్తా

## హీరో బెల్లంకొండ శ్రీనివాస్ గట్టి నమ్మకం

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా వస్తున్న చిత్రం కిష్కింధపురి. కౌశిక్ పెగల్లపాటి దర్శకుడు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ జానర్ లో వస్తున్న ఈ సినిమా -ట్రైలర్ కు మంచి స్పందన లభించింది. భైరవం తర్వాత వస్తున్న ఈ సినిమాపై బెల్లం కొండ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. ఈ నెల 12న ఈ సినిమా వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది. కాగా ఈ సినిమాను భారీ స్థాయిలో ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో బెల్లం కొండా మాట్లాడుతూ ' సినిమా అంటే రెండున్నర గంటలు ఆడియెన్స్ ని ఎంట్టంల్గ÷న్ చేయడం. థియేటర్ లో కూర్చున్నపుడు ప్రేక్షకుడు బోర్ ఫిల్ అయి మొబైల్ చూడకుంటే ఆ సినిమా హిట్. నేను కాన్ఫిడెంట్ గా చెప్తున్న కిష్కిందపురి సినిమా స్టార్ట్ అయిన పది నిమిషాల తర్వాత ఆడియెన్స్ ఫోన్ చూడరు. ఒకవేళ అలా ఎవరైనా చూస్తే నేను అసలు ఇంకా సినిమాలు చేయను ఇండస్ట్రీ వదిలి వెళ్తాను. ఈ సినిమా అంత బాగుంటు-ంది. ఇది నేను ఛాలెంజ్ చేసి చెప్తున్నా. ఈ సినిమా కథపై నమ్మకంతో చెప్తున్న. కథ పరంగా, సౌండింగ్ పరంగా ఈ సినిమా చాలా బాగుంటుంది. ఆ నమ్మకంతో చెప్తున్న కిష్కింధపురి మిమ్మల్ని తప్పకుండా ఆకట్టుకుంటుంది' అని అన్నారు. బెల్లం కొండా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మరి బెల్లం స్టార్ మాటలు ఎంతవరకు నిజమవుతాయో రెండు రోజుల్లో తెలుస్తుంది.




# ఏందీ అమ్మడు ఈ క్రేజ్..

## ఏడేళ్లుగా సినిమాలు లేవు.. అయినా కోట్ల సంపాదన..

ఏందీ అమ్మడు ఈ క్రేజ్.. ఏడేళ్లుగా సినిమాలు లేవు.. అయినా కోట్ల సంపాదన..బాలీవుడ్ ఇండస్ట్రీని ఓ ఊపు ఊపేసింది. స్పెషల్ పాటలతో యువతను ఆకట్టుకుంది. అందం, అభినయంతో కట్టిపడేసింది. 51 ఏళ్ల వయసులోనూ ఈ అమ్మడు హవా ఏమాత్రం తగ్గడం లేదు. ఇంతకీ ఆ బ్యూటీ ఎవరంటే..ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ మలైకా అరోరా. అటు గ్లామర్.. ఇటు వ్యాపారరంగాల్లోనూ సత్తా చాటుతుంది. మలైకా అపార్ట్‌మెంట్ లోఖండ్‌వాలాలోని రన్‌వాల్ ఎలిగంటే అనే హై-రైజ్ సొసైటీలోని 15వ అంతస్తులో నివసిస్తుంది.మలైకా 2018లో ఆ ఫ్లాట్‌ను రూ.3.26 కోట్లకు కొనుగోలు చేసింది. గత ఏడు సంవత్సరాలలో, ఆ ప్రాంతంలోని ఆస్తుల విలువ పెరిగింది, దీని వలన ఆమె దానిని రూ.5.3 కోట్లకు అమ్మగలిగింది.ఈ డీల్ కోసం రిజిస్ట్రేషన్ 21 ఆగస్టు 2025న పూర్తయింది. రిజిస్ట్రేషన్ ఫీజులు, టాంప్ డ్యూటీని కవర్ చేస్తూ వారు అదనంగా రూ.31.38 లక్షలు చెల్లించారు.గత సంవత్సరంలోనే, రన్‌వాల్ ఎలిగంటే ప్రాజెక్ట్‌లో 22 ఆస్తి లావాదేవీలు జరిగాయి, వీటి మొత్తం విలువ రూ.109 కోట్లు. ఈ సొసైటీలో చదరపు అడుగుకు సగటు ధర రూ.33,150గా ఉంది. చాలాకాలంగా ఈ అమ్మడు సినిమాలకు దూరంగా ఉంటుంది.

# మజాకా' సినిమాకు నష్టాలు.. బయ్యర్లకు డబ్బులు తిరిగిచ్చిన నిర్మాత




సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'మజాకా'. ఈ సినిమాకు త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహించగా.. రావు రమేష్ కీలక పాత్రలో నటించాడు. ఫిబ్రవరి 26న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. అయితే ఈ సినిమా పరాజయం కావడంతో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న నిర్మాత రాజేష్ దండా బయ్యర్లను ఆదుకోవడానికి ముందుకు వచ్చారు.సినిమా నష్టాలపై నిర్మాత రాజేష్ దండ ఇటీవల బయ్యర్లతో సమావేశం కాగా.. ఈ సమావేశంలో నష్టపోయిన బయ్యర్లకు డబ్బులను తిరిగి ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం. అమ్మిన రేటును బట్టి బయ్యర్లకు వచ్చిన నష్టాలతో పాటు జీఎస్టీ కలిపి మొత్తం నాలుగు కోట్ల రూపాయలు వెనక్కి ఇచ్చారు. సినిమా నిర్మాణానికి భారీగా ఖర్చు చేసి, నష్టాలు వచ్చిన తర్వాత కూడా బయ్యర్లను ఆదుకున్న రాజేష్ దండా నిర్ణయం సినీ పరిశ్రమలో ప్రశంసలు అందుకుంటున్నాడు. ఈ సినిమాను ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్యమూవీస్, మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి.

# అక్షయ్‌కుమార్ 'జాలీ ఎల్‌ఎల్‌బీ 3' ట్రైలర్ రిలీజ్




అక్షయ్‌కుమార్ 'జాలీ ఎల్‌ఎల్‌బీ 3' ట్రైలర్ రిలీజ్బాలీవుడ్ స్టార్ నటులు అక్షయ్‌కుమార్ , అర్షద్ వార్సీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జాలీ ఎల్‌ఎల్‌బీ 3' . కోర్టు రూమ్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రం 'జాలీ ఎల్‌ఎల్‌బీ' సిరీస్‌లో రాబోతున్న మూడో చిత్రం. మొదటి చిత్రంలో జాలీగా అర్షద్ వార్సీ నటించి హిట్‌ని అందుకోగా.. రెండో పార్టులో అక్షయ్‌కుమార్ జాలీగా నటించి హిట్‌ని అందుకున్నాడు. ఇప్పుడు వీరిద్దరూ కలిసి జాలీ ఎల్‌ఎల్‌బీ 3లో రాబోతున్నారు. ఈ సినిమాకు సుభాష్ కపూర్ దర్శకత్వం వహిస్తుండగా.. అలోక్ జైన్, అజిత్ అంధారే నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. నిజ జీవిత సంఘటనల ఆధారంగా రాబోతున్న ఈ ట్రైలర్‌ను ఫుల్ ఫన్నీగా సాగింది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492